ధ్వంసమైన సీసీ రోడ్లు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన వీధుల్లో సిమెంట్ రోడ్లు ధ్వంసమై గుంతలు పడటంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్ద కాలం క్రితం రోడ్లు నిర్మించడం, నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో సిమెంట్ రోడ్లు ధ్వంసమై రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గాంధీ సెంటర్–రైల్వే ఆస్పత్రి రోడ్డు, జెడ్పీ స్కూల్–సెయింట్ ఆగ్నేస్ స్కూల్ రోడ్డు, స్టేట్ బ్యాంక్–బ్రిలియంట్ స్కూల్ రోడ్డు, నెహ్రూస్ట్రీట్–బంకట్‌సింగ్‌తండా రోడ్డు, నెహ్రూస్ట్రీట్–టంకుతండా రోడ్డు, పెట్రోల్ బంక్–బుద్దారం క్రాస్ రోడ్డుతోపాటు పలు వీధుల్లోని సిమెంటు రోడ్లు ధ్వంసమయ్యాయి.

పట్టించుకోని పాలకులు..

డోర్నకల్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా మారి మొదటి పాలకవర్గం ఎన్నికైనా ధ్వంసమైన సిమెంటు రోడ్లను పాలకులు పట్టించుకోలేదు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు కాగా వీటిలో రూ.5.72కోట్ల నిధులతో మున్సిపాలిటీ పరిధిలో 8కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు నిర్మించారు. పెత్తనం చెలాయించే నాయకులు తమకు అనుకూలమైన వీధులు, తమ పార్టీకు చెందిన వారు ఎక్కువగా ఉన్న వీధుల్లో సిమెంటు రోడ్లు నిర్మించాలని ప్రతిపాదించడంతో ధ్వంసమైన రోడ్లకు మోక్షం లభించలేదు. ప్రైవేటు స్కూళ్ల గేట్ల వరకు సిమెంటు రోడ్లు నిర్మించేందుకు కృషి చేసి స్కూళ్ల యాజమాన్యం ముందు మోకరిల్లిన నాయకులు ప్రజలు తిరిగే రోడ్లను పట్టించుకోలేదు. తరువాత సిమెంటు రోడ్ల నిర్మాణాలకు కొన్ని నిధులు కేటాయించిన పాలకులు తమకు అనుకూలమైన వీధుల్లో రోడ్లపై రోడ్లు నిర్మించి ప్రజలు తిరిగే రోడ్లను పట్టించుకోలేదు. ధ్వంసమైన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున అధికారులు, పాలకులు స్పందించి కొత్త రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రైల్వే ఆస్పత్రి రోడ్డులో ధ్వంసమైన రోడ్డు


సెయింట్ ఆగ్నేస్ పాఠశాల రోడ్డులో..

క్లుప్తంగా

రూ.50వేల ఆర్థికసాయం



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన మురళీ అనే ప్రైవేట్ టీచర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ పరిస్థితిని పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసిన రెండురోజుల్లో దాతలు స్పందించి, ఫోన్‌పే ద్వారా రూ.50వేలు పంపించినట్లు గ్రామానికి చెందిన కూటికంటి మధు తెలిపాడు. ఈమేరకు మృతుడి కూతురు అక్షయ పేరుపై పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ చేసిన రూ.50వేల బాండ్‌ను ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, రజినీకాంత్, యేసు, భిక్షపతి పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



చిన్నగూడూరు: మండలంలోని పగిడిపల్లి గ్రామంలో నీళ్లు రావడంలేదని మహిళలు రోడ్డుపై బైఠాయించి ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. 22రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు వీరమ్మ, బుచ్చమ్మ, పూలమ్మ, సింధుజ తెలిపారు.

కరాటేలో గోల్డ్‌మెడల్



నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆకుతోట సంతోష్ కుమారుడు ఆకుతోట కార్తికేయ ఆదివారం తొర్రూరు చాంబర్ ఆఫ్ కామర్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించాడు.

నేటినుంచి లోక్ అదాలత్

కొత్తగూడ: ఈనెల 23వ తేదీ నుంచి 28 వరకు జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కుశకుమార్ సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను రాజీ పడటం ద్వారా కొట్టి వేయించుకోవచ్చని అన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మహబూబాబాద్ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న 100 మీ సేవ కేంద్రాల నిర్వాహకుల సమావేశం అనంతాద్రి మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసచారి, పిన్ని రాము, అధ్యక్షుడిగా దేశబోయిన అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దేశ్ నరేష్, కోశాధికారిగా నాగేందర్, ఉపాధ్యక్షులుగా రమేష్, సుధాకాంత్, నంతోష్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, కేలోత్ అమర్‌నాథ్ చౌహాన్, ప్రచార కార్యదర్శిగా గుజరాతి రాంప్రసాద్ ఎన్నికయ్యారు.

ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి

తొర్రూరు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల నిర్వాహకుడు శ్రీధర్, రామచంద్రయ్య, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న వీరన్న

మరిపెడ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు తిప్పికొట్టాలని, కార్మిక సంక్షేమ కోసం ప్రతి మండల కేంద్రంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుండి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం మండలంలోని గాలివారిగూడెం గ్రామంలో బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ యూనియన్ గ్రామ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దుండి వీరన్న, జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య హాజరై మాట్లాడుతూ.. కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన నిధులను కేంద్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. నేడు సెప్టెంబర్ 23న జరిగే చలో హైదరాబాద్‌కు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని వీరన్న పిలునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జిన్నా లచ్చయ్య, యాదగిరి, ముత్తయ్య, శ్రీనివాస్, పాపయ్య, రామయ్య, వెంకన్న, చంద్రశేఖర్, భద్రయ్య, రమేశ్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

తొర్రూరు: క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సీఐ జగదీష్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్కులో ఆదివారం పోలీసులు, మీడియా ప్రతినిధులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, పిల్లల రాజు, రమేష్‌బాబు, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కమిటీ ఎన్నిక

తొర్రూరు: పీఆర్‌టీయూ మండల కమిటీని డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జినుగ విప్లవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పులి ముత్తిలింగం, అసోసియేట్ అధ్యక్షుడిగా వసుంధర్, కార్యదర్శిగా రంజాన్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా అనుపమ, కార్యదర్శిగా స్వప్నలను ఎన్నుకున్నారు.

తెగిన కట్టను పూడ్చాలి

నెల్లికుదురు: భారీ వర్షాలకు తెగిపోయిన పులికుంట చెరువు కట్టను పూడ్చి రైతుల రాకపోకలు, పంటల సాగుకు నీరందించాలని బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు పులి రామచంద్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కట్ట తెగిపోయి 300 వందల మంది రైతులకు చెందిన 500 వందల ఎకరాల వరి పంటలకు నీటి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి కట్టను పూడ్చి రైతులను ఆదుకోవాలని కోరాడు. కార్యక్రమంలో రైతులు కోల సోమయ్య, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్య తీసుకోవాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మండల విద్యాశాఖ అధికారి పూల్‌చంద్‌పై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు ఆదివారం ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కురవి మండలం టేకుల తండాకు చెందిన ఉపాధ్యాయుడు గుగులోతు వీరభద్రం రేకుల తండాకు చెందిన సుగుణను వివాహం చేసుకున్నాడన్నారు. తర్వాత వీరభద్రం రెండో వివాహం చేసుకున్నాడని, ఈ క్రమంలో సర్వీస్ బుక్‌లో హెల్త్‌కార్డులో రెండో భార్య, పిల్లల పేరును నమోదు చేసుకున్నట్లు తెలిపారు. దీంతో మొదటి భార్య సుగుణకు అన్యాయం జరిగిందన్నారు. విచారణలో ఎంఈఓ వీరభ్రం ఉపాధ్యాయుడి దగ్గర నుంచి డబ్బులు తీసుకొని తప్పుడు సమాచారం విద్యాశాఖకు సమర్పించారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎంఈఓపై చర్యలు తీసుకొని మొదటి భార్య సుగుణకు న్యాయం చేయాలని వారు కోరారు.

కాళోజీ వాకర్స్ నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం కాళోజీ వాకర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎనుకున్నారు. ఈసందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2012 సంవత్సరంలో ప్రజాకవి, నిత్య చైతన్య స్ఫూర్తి కాళోజీ నారాయణరావు పేరు మీద కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షుడిగా నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారిగా సోమ విష్ణువర్ధన్, సహాధ్యక్షుడు తోడేటి వెంకన్న, సమన్వయ కర్త మందాటి మధుసూదన్‌రావు, సలహాదారులు నాగేశ్వర్‌రావు, వాట్యానాయక్, పెద్ది వెంకన్న, సుధాకర్, ఆరుద్ర పరమాత్మచారిలను, సభ్యులను ఎన్నుకున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆకేరువాగు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలు, రోడ్లు, ఆలయాలు కొట్టుకుపోయి విధ్వంసం సృష్టించింది. ఒక పక్క పంట పొలాలు కొట్టుకుపోయి పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడి రైతులు కన్నీరుమున్నీరవుతుంటే, మరో పక్క ఇసుకాసురులు తమకేమీ పట్టనట్లు జోరుగా ఇసుక దందా చేస్తున్నారు. ఆదివారం అనుమతి లేకపోయినా అక్రమార్కులు ట్రాక్టర్లలో వందల సంఖ్యలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు ఒక చేతిలో చరవాణి, మరో చేతిలో స్టీరింగ్ పట్టుకుని ప్రమాదకరంగా ట్రాక్టర్ నడుపుతున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


డోర్నకల్: 1996-97 బ్యాచ్ విద్యార్థులు


మహబూబాబాద్: డిగ్రీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గూడూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో..

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1991నుంచి 1994 వరకు డిగ్రీ చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌సీ కన్వెన్షన్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దోంతు రమేష్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, గీత, రంజని, షాహిన్ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. సుమారు వందమంది పాల్గొన్న సమ్మేళనంలో వాటర్ కూలర్‌తోపాటు పది కుర్చీలు పాఠశాల హెచ్‌ఎం నర్సింహరావుకు అందించారు.

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఆదివారం 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ


నెహ్రూసెంటర్: సరుకులు అందజేస్తున్న సంస్థ బాధ్యులు

నెహ్రూసెంటర్: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరదలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు ఇన్‌ఫోర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ప్రముఖ వ్యాపారవేత్త చిదిరాల జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పానకం ప్రవీణ్, రేపాల నాగేంద్ర, సరస్వతుల విజయ్, సయ్యద్ అబ్దుల్ పాల్గొన్నారు.

టీడీఎఫ్ సంస్థ చేయూత

మరిపెడ రూరల్: మండలంలోని బాల్నిధార్మం, సీతారాంతండా ముంపు బాధిత కుటుంబాలకు టీడీఎఫ్ చేయూతనిచ్చింది. ఆదివారం బాధిత కుటుంబాలకు టీడీఎఫ్ ఇండియా ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో వలంటీర్లు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు వినీల్, ఇందుప్రియ, వర్షా, ప్రియాంక, మేఘన, వేణుగోపాల్, యాదయ్య, తండావాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

గార్ల: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే యువకుడు నితిన్ విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. మృతుడు నితిన్ కుటుంబానికి విద్యుత్‌శాఖ రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశాడు.

ఏజెన్సీలోని చెరువులను రక్షించాలి

కొత్తగూడ: ఏజెన్సీ మండలాల్లోని చెరువులను రక్షించాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. పలు చెరువులను వలసవాదులు ఆక్రమించుకుని ఇటుక బట్టీలు, ఇళ్లు నిర్మించుకుంటున్నారని , కబ్జా నుంచి చెరువులను కాపాడాలని కోరాడు. ఈసమావేశంలో నర్సింగరావు, సందీప్, సారయ్య, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు

మహబూబాబాద్ రూరల్: పట్టణ శివారులోని మంగలి కాలనీలో వెలసిన అభయ ఆంజనేయ స్వామికి ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. స్థానికంగా అభయ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. దాతలు, భక్తులు ఆలయ నిర్మాణ పనులకు సహకరించాలని వారు కోరారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ..

మహబూబాబాద్: మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గారి తండ్రి కేవ్లానాయక్ అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీ పోరిక బలరాంనాయక్, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోతు కిషన్ నాయక్, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య ఆదివారం కేవ్లా నాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారివెంట ఎంఎస్పీ మహిళ జిల్లా అధ్యక్షురాలు రజియా, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోలెపాక ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే చర్యలు

బయ్యారం: మండలంలో శాంతిభద్రతలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తిరుపతి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో కొన్ని రోజులుగా సోషల్‌మీడియా ద్వారా కులాలు, పార్టీలు, వ్యక్తులు, మతాలను రెచ్చగొట్టేవిధంగా ఇష్టానుసారంగా షేర్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై వాట్సాప్ గ్రూపుల అడ్మిన్‌లతో సమావేశం నిర్వహించి సూచనలు తెలియజేస్తామన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన గైరబోయిన నవీన్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు ఆదివారం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశాడు.

శుభాకాంక్షలు

కేసముద్రం: కొత్తగా నియామకమైన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలయ్య, డైరెక్టర్లకు, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం లేఖ పంపారు.

చెక్కు అందజేత

కురవి: మండలంలోని తులిస్యాతండాకు చెందిన దూప్‌సింగ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటివీరభద్రం ఆదివారం అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు ఇస్లావత్ సుధాకర్, మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వబ్రాహ్మణ సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఆరెందుల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా బొల్లోజు నరసింహచారి, కందాల ఆదర్శచార్యులు, ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి జితేందర్ రావు, కోశాధికారి బొల్లోజు రమేష్, గౌరవ అధ్యక్షుడు ఉల్లి వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుడు బొల్లోజు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

క్వారీ పనులు ఆపాలి

నెల్లికుదురు: మండలంలోని నల్లగుట్ట తండా గ్రామ పరిధిలోని వెంకటేశ్వర స్టోన్ క్రషర్ క్వారీని నిలిపివేయాలని తండావాసులు కిషన్, వెంకన్న, గోపా, శంకర్, బాలాజీ, వీరన్న, కోక, మంగ్య, రాజు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్వారీలో బాంబుల మోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

నెహ్రూసెంటర్: మహాత్మజ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ 134 ఆవిర్భావం సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నేడు జిల్లా కేంద్రంలోని రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి చిన్నచంద్రన్న ఆదివారం తెలిపాడు. ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కుల నిర్మూలన చైతన్యాన్ని ప్రజల్లో ప్రచారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి



మహబూబాబాద్ రూరల్: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని ముస్లిం మతపెద్ద మౌలానా మహ్మద్ సయీద్ అహ్మద్ రిజ్వీ అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదిన మాస శుభ సందర్భాన్ని పురస్కరించుకుని అహ్లె సున్నత్ వల్ జమాత్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముబీన్, చాంద్ పాషా, నయీం, హారుణ్, ఆసిఫ్ అలీ ఫకీర్, ఖలీల్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు విఫలం

తొర్రూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో సీపీఎం పట్టణ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమంలో యాకూబ్, శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

జ్వరంతో ఉపాధ్యాయుడి మృతి


శంకర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయుడు బొడ్డుపల్లి శంకర్ (45) జ్వరంతో ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్, జిల్లా నాయకులు బలాస్టి రమేష్, సోమ విష్ణువర్ధన్, నాయకులు రాచకొండ ఉపేందర్, సజ్జనము విద్యాసాగర్, కోడెం శ్రీనివాస్, మోహన్, రాజు, అంజయ్య, రమేష్ సంతాపం తెలియజేశారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు



గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన నూనావత్ నరేష్ అనే యువకుడు అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. రాములుతండాకు చెందిన నూనావత్ స్వామి కుమారుడు నరేష్ (25) కొద్దికాలంగా మతిస్థిమితం కోల్పోయాడని, గత మంగళవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. నలుపు రంగు ప్యాంటు, ఉదారంగు టీషర్టు వేసుకున్నాడని, ఎవరికైనా అతని ఆచూకీ తెలిస్తే వెంటనే 90144 24689, 63059 67708, 70758 15931 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఇతని ఆచూకీ తెలిపిన వారికి పారితోషికం కూడా ఇస్తారన్నారని, అదృశ్యమైన వ్యక్తి తండ్రి స్వామి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

నెల్లికుదురు: మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్ చిదిరాల నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు ఆదివారం తెలిపారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన పిట్టల ఎల్లయ్య తన మోటార్ సైకిల్‌పై నెల్లికుదురు వైపు వస్తున్న క్రమంలో నెల్లికుదురు నుంచి మరిపెడ వైపునకు చిదిరాల నాగరాజు ఆటో వెళ్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పరిధిలో మోటార్ సైకిల్‌ను ఆటో ఢీకొట్టడంతో ఎల్లయ్యకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ నాగరాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కేసముద్రం: ప్రమాదవశాత్తు ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన కేసముద్రంవిలేజ్ సమీపంలోని కోరుకొండపల్లిక్రాస్ రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం చీన్యాతండాకు చెందిన గుగులోతు చంద్రమౌళి అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కేసముద్రం వైపునకు వెళ్తుండగా, కేసముద్రం నుంచి ఇనుగుర్తి వైపు ఆటో కేసముద్రంవిలేజ్ సమీపంలో మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న చంద్రమౌళి తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి.


యువకుడి ఆత్మహత్యాయత్నం

మరిపెడ రూరల్: ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కథనం ప్రకారం.. చిల్లంచర్ల గ్రామానికి చెందిన మురారి వెంకన్న చిన్నకుమారుడు మురారి మహేష్(22) హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల స్వగ్రామమైన చిల్లంచర్ల గ్రామానికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన ఓ యువతిపై దురుసుగా ప్రవర్తించాడని యువతీ కుటుంబ సభ్యులు యువకుడిపై శనివారం దాడి చేశారు. అనంతరం యువకుడి కుటుంబ సభ్యులు యువతీ కుటుంబంపై దాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో యువతీ కుటుంబ సభ్యులు మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో యువకుడిపై కేసు పెట్టడంతో మహేష్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి మందలించారు. ఆదివారం మళ్లీ స్టేషన్‌కు రావాల్సి ఉండగా మనస్తాపంతో ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు మహేష్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

జగ్గుతండాలో చెట్టుపై పడిన పిడుగు

బయ్యారం: మండలంలోని జగ్గుతండా గ్రామపంచాయతీ సమీపంలో ఓ చెట్టుపై శనివారం రాత్రి పిడుగుపడింది. తండాకు దగ్గరగా ఉన్న చెట్టుపై భారీ శబ్దంతో పిడుగుపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలో విద్యుత్ వస్తువులు కాలిపోయినట్టు స్థానికులు తెలిపారు.

'ఆలా' ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



కురవి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ సభ్యుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాలోత్ ఆలా ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ నాయకుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం తండాలో మాలోత్ ఆలా విగ్రహావిష్కరణ, సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, నాయకులు హలావత్ లింగన్న, సామ పాపయ్య, ఆలకుంట్ల సాయిలు, యాకయ్య, పర్వత కోటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.